


# కారాగి పోయింది

కొడవటిగంటి కుటుంబరావు

ఎవరో లేపినట్టుగా వాణి చివాలున పక్క మీద లేచి కూర్చున్నది. నిద్ర సుఖ మెరగదంటారు. కాని గడిచిన రాత్రి ఆమె చాలా సుఖంగా నిద్రపోయింది. ఒళ్లుతెలియని నిద్రలో కూడా ఆమెకు మేఘాలమీద తేలిపోతుస్నట్టుగానే ఉన్నది. నిద్ర లేచాక ఆ మేఘాలే మరింత ఎత్తుగా ఆమెను తేల్చుకుపోతున్నాయి.

తన ఆనందానికి కారణం జ్ఞాపకంరాగానే వాణి చిన్నగా నవ్వుకుని, కొద్దిగా సిగ్గుపడ్డ దానిలాగా తలవంచుకున్నది — ఎదురుగా ఎవరూ లేకపోయినా.

ఇవాళ ఆమె రెండు కంట్రాక్టులమీద సంతకం చెయ్యబోతున్నది.

అంతా ఆచార్లగారి చలవ. ఆయన తన జీవితంలోకి అడుగుపెట్టి ఇంకా నెలకాక పోయినా, తనకు తల్లికన్నా, తండ్రికన్నా, తోబుట్టువులకన్నా దగ్గిరవాడయాడు

ఆయనే జాతక చక్రంవేసి, "రాహువు యోగించాడు. పదహారు, పదిహేడేళ్ళపాటు దివ్య తారగా వెలుగుతావు. ఢోకాలేదు. లక్షలు గడిస్తావు. మహా రాణియోగం!" అన్నాడు.

రాహువు అంత మంచివాడని వాణికి తెలీదు....మళ్లీ ఆ ఆచార్లగారే, "రాహు కాలం దాటనిచ్చి సంతకాలు చేద్దాం," అన్నాడు.

ఇలాటి తబిశీళ్లు వాణికి అర్థంకావు. ఆమె ఏమంత చదువుకున్నది కూడా కాదు.

కాని ఒకటి తెలును. ఇప్పుడు తను ఉండే ఇల్లు తనకు శాశ్వతం[illegible]ు. తనకు సొంత ఇల్లూ, సొంత కారూ, ఒక మంచి తోటా, ఒక బుల్లి కుక్కపిల్లా, ఒక రేడియో–దాని పేరేదోఉండాలి – గ్రామఫోను రేడియో, ఇంకా వచ్చి, మంచి నైలాన్ చీరెలూ, తల తళా మెరిసే నగలూ, అన్నీ వస్తాయి.

అన్నట్టు బుల్లెమ్మకు ఫెళ్లున పెళ్లి చెయ్యాలి. సినిమావాళ్లనందర్నీ పిలవాలి. వాళ్లిచ్చే ప్రెజెంట్లు గుట్టలు గుట్టలుగా పేరాలి!....బుల్లెమ్మ వాణి చెల్లెలు.

వాణి "పేరాశ" లో నటిస్తుండగానే ఒక సినిమాతార ఇంట పెళ్లిఅయింది. పెళ్లంటే అలా ఉండాలి!

"పేరాశ" హిట్టయింది. పత్రికలు వాణిని ఆకాశానికి త్తేశాయి. అందులో ఆమె రెండో హీరోయిన్. అయితేనేం? అసలు హిరోయిన్ని, పాపం, తలచినవాళ్లులేరు....

తనకు కొత్త బుకింగులు వస్తున్నాయని తెలిసినప్పటినుంచీ వాణి తీరిక దొరికినప్పుడల్లా తన భవిష్యత్తులోకి చూసుకుని మురిసిపోతున్నది. ఒక్కొక్కసారి ఎవరితోనో మాట్లాడుతుండగా తన భవిష్యత్తు పలకరిస్తుంది. వెంటనే ఆమెకు ఒంటరిగా ఉండబుద్ధవుతుంది. ఆ మాట్లాడే జిడ్డుగాళ్లు వెళ్లిపోతే బాగుండుననిపిస్తుంది. కాని వాళ్లు వెళ్లరు. చంపెయ్యాలనిపిస్తుంది.

ఆ భవిష్యత్తులో ప్రతిసారీ ఏదో ఒక కొత్త వింత కనిపిస్తుంది. డబ్బూ, కీర్తీ, పబ్లిసిటీ, ఇంటర్వ్యూలూ అలా ఉంచి, బాలట్‌లో తాను ఉత్తమ తారగా రావచ్చు! తనకు శివాజీ పక్కన అరవ పిక్చర్లో వేషం దొరకవచ్చు! (మహాదేవన్ తనకు అరవం బాగా వస్తున్నదంటున్నాడు. మహాదేవన్ అంటే వాణికి అరవం నేర్పుతున్న మేష్టరు.) ఎవరు చూశారు తను రాజ్‌కపూర్ పక్కనే వేషం వెయ్యొచ్చు. (అన్నట్టు హిందీ మేస్టరింకా కుదర లేదు. దాన్ని గురించి తను విచారించనక్కర్లేదు. ఆచార్లగారా ప్రయత్నంలోనే ఉన్నాడు.) తన పిక్చరుకు ప్రెసిడెంటు పతకం వచ్చి, తను ఢిల్లీ వెళ్లటం జరిగితే? అంతకన్నా ఇంకేమన్నా పైన ఉందా? ఎందుకు లేదూ? అంతర్జాతీయ ఫిలిం పోటీలో తనకు బెస్టు యాక్ట్రెస్ బహుమానం రావచ్చుగా?.... అబ్బ, అప్పుడే అంత దూరం ఆలోచించరాదు ఆచార్లగారన్నట్టు, ఓర్పు!—ఓర్పు అవసరం. జరగవలిసిందంతా గ్రహాలే చేస్తాయి. ఆ పైన ఆపదమొక్కులవాడూ, తంగేడు సాయిబాబా, ఉల్లిపాలెం మహర్షీ ఉండనే ఉన్నారు.

వాణి పూర్తిగా మేకప్పయి డ్రాయింగు రూములోకి వచ్చేసరికి ఎనిమిది దాటింది. (అవి డ్రాయింగు రూమా? అవి సోఫాలా? ఛీ! ఛీ! ఇంకో ఆరునెల్లాగి చూడు.)

తనకు ఏ మాత్రమూ అర్థంగాని సోఫాలో కూర్చుంటూండగా టెలిఫోను మోగింది. (టెలిఫోను కూడా ఆచార్లగారు ఏర్పాటు చేసినదే.)

టెలిఫోన్ చప్పుడు వినపడగానే వాణికి అంతెత్తు మేఘాలమీదినుంచి ఒక్కసారి దభాల్న నేలమీద పడ్డట్టయింది.

వాడే అయుంటాడు. సైతాను లాగా పట్టుకున్నాడు, దరిద్రుడు!

దరిద్రుడన్నమాట అక్షరాలా నిజం కాదు. వాడు వారం రోజుల క్రితం మొట్టమొదట రాసిన ఉత్తరంలో తాను మూడు లక్షల ఆసిపరుణ్ణని రాశాడు. తనకు వాణి పైన చచ్చేటంత ప్రేమ ఉన్నదన్నాడు. "....నువ్వు నిజంగా నటివి కావు. నీ స్వభావానికి తగిన పాత్ర అదృష్టవశాత్తూ నీకు దొరికింది గనక అందరూ నువ్వొక గొప్ప నటివనుకుంటున్నారు. నీ అదృష్టం కొద్దీ మంచి డైరెక్టరు జత పడ్డాడు. లేకపోతే ఈపాటికి మళ్లీనువ్వు మీ పాలికేపల్లి చేరి ఉండవలసిన దానివే. నీ సినిమా వృత్తితో నాకేమీ సంబంధం లేదు. నన్ను పెళ్లాడెయ్యి. నిన్ను స్వర్గ వీధులలో తిప్పుతాను. ప్రపంచంలో ఇంతమంది ఆడవాళ్లుండగా నేను నిన్నే ఎందుకు ప్రేమిస్తున్నానో, ఇంత గాఢంగా ఎందుకు ప్రేమిస్తున్నానో ఆ దేవుడికే తెలియాలి. నేను అనాకారివాణ్ణి కాను. నాకోసం ఎంతలేసి సంబంధాలు వచ్చి ఉంటాయో ఊహించుకో. అన్నిటినీ కాల తన్నాను. నీ నమ్మతికోసం ఆత్రంగా ఎదురు చూసే నీ ప్రియుడు, దుర్గారావు."

చాట భారతమంత ఉత్తరం. అది చదువుకుని వాణి భగ్గున మండి పడింది. "చవట! వెధవ! భ్రష్టం!" అని ఆ దుర్గారావును తిట్టుకున్నది. వాడు తన భవిష్యత్తుకు రాహువల్లే అడ్డు తగలాలని చూస్తున్నాడు.... రాహువు కాదు, ఇంకేదన్నా అనాలి — తన భవిష్యత్తంతా రాహువుమీదే గదా ఆధారపడి ఉంది!

ఆ ఉత్తరం వచ్చిన మూడో రోజునుంచి టెలిఫోనుమీద జిడ్డు పట్టిస్తున్నాడు. ప్రతిసారి ఏ ప్రొడ్యూసరో అనుకుని తాను పరిగెత్తుకుంటూ పోయి టెలిఫోను ఎత్తటమూ ఆ భ్రష్టుడు, "హలో, వాణీ! నేను దుర్గారావును," అనటమూనూ.

మొదటిసారి తను వాడితో మాట్లాడింది. అది పొరపాటు. ఉత్తరం రాసినందుకు నాలుగూ పెడదామన్న దురాశతో మాట్లాడింది. లాభం లేక పోయింది. ఆ మనిషి మాటలకు చలించేవాడు కాడు. ఎనుబోతుమీద వాన కురిసినట్టే. ఆ ఉత్తరంలో రాసిన ముక్కలే మళ్ళీ మళ్ళీ చెప్పాడు. తనను చూడటానికి ఎంగేజిమెంటు పెట్టమన్నాడు. ఎంగేజిమెంటంటే పెళ్ళి నిశ్చయమని కూడా అర్థం ఉందిట. ఆ మాట చెప్పి గట్టిగా నవ్వాడు. ....అఖరుకు తట్టింది, తాను టెలిఫోను పెట్టేస్తే ఆ మనిషి ఆట కట్టవుతుందని!

....ఇంకా ఆ టెలిఫోన్ అలాగే మోగుతోంది. ఎవరన్నా ఎత్తితే బాగుణ్ణు. "సరసమ్మా? ఓ సరసమ్మా! సరవాయ్?.... ఎక్కడున్నారో? సమయానికుండరు!"

ఎవరో టెలిఫో నెత్తారు.

"ఉన్నదండీ. పిలవమంటారా?" అని బుల్లెమ్మ గొంతు వినపడింది.

"ఎవరే అది, బుల్లీ?" అని వాణి కేక పెట్టింది.

"ఆచార్లుగారక్కా."

"వస్తున్నా ఉండు," అంటూ వాణి అవతలి గదిలోకి వెళ్ళింది.

ఆమె అయిదు నిమిషాల అనంతరం తిరిగివచ్చేసరికి, ఎవరో కుర్రాడు ఒక సోఫాలో కూర్చుని, తానే ఇంటి యజమాని అయినట్టుగా, దర్జాగా సిగిరెట్టు కాలుస్తున్నాడు.

మనిషి అందంగానే ఉన్నాడుగాని సినిమాకారు మనిషికాడు.

"ఎవరూ?" అన్నది వాణి.

"గుర్తుపట్టలేదా? నేను దుర్గారావును," అన్నాడతను.

కోపంతోనూ, ఏదో చెప్పరాని భయంతోనూ వాణి నోరు కట్టుబడింది.

"నేననుకున్నది నిజం. నీకు నటన రాదు. నిజంగా నటివై ఉంటే నీ మొహంలో ఆశ్చర్యమో, ఆహ్లాదమో రావలిసింది. అద్దంలో చూసుకో," అన్నాడతను.

కోపం జయించింది. వాణి పట్టరాని కోపంతో గొంతు కీచుపోయి, "నిన్నసలెవరు లోపలికి రానిచ్చారూ? పోముండు బయటికి!" అని అరిచింది.

"హోప్‌లెస్! అట్టర్లీ హోప్‌లెస్. ఆ డయలాగు సరిగా రావాలంటే నువు రోజల్లా రిహర్స్ చెయ్యవలిసి ఉంటుంది. నువు కోపం అభినయిస్తున్నానన్న సంగతే మరిచావు. వైరానుపత్రి సీనుకాదిది. నిన్ను ప్రాణంకన్న ఎక్కువగా ప్రేమించినవాడు చూడవస్తే నీకతగాడిమీద ఆగ్రహంవచ్చింది. నువు ట్రాజిక్ హీరోయినువు. అంచేత నీ మంచి నీకు తెలియక ఆగ్రహిస్తున్నావు. ఇప్పుడా డయిలాగ్ మళ్ళీ చెప్పు."



ఆ దుర్మార్గుణ్ణి చంపటమో, తాను తల నేలకేసి కొట్టుకుని చావటమోతప్ప వాణికి మూడోమార్గం తట్టలేదు.

"నీకు సిగులేదూ?" అన్నదామె.

"నో గుడ్! వట్టి ఎన్. జీ.! కనుబొమలు చిట్లించాలి. మూతి అసహ్యంగా విరవాలి."

దయ్యాన్ని చూసినదానిలాగా వాణి హాలులోనుంచి లోపలికి పారిపోయి, తన పడకగదిలో దూరి తలుపేసుకున్నది.


ఆరోజు రెండు పిక్చర్లకు సైన్‌చేసేదాకా వాణి మనసుకు ఏదో గ్రహణంపట్టినట్టే ఉన్నది. ఆ తరవాత దుర్గారావు కొత్త కంట్రాక్టుల అడుగునపడిపోయాడు.

తరవాత అతను జ్ఞాపకంవచ్చినప్పుడు తలుచుకుంటే తన ప్రవర్తన పూర్తిగా తప్పుగా తోచింది వాణికి.

తన కతనిపైన వచ్చిఉండవలిసింది కోపమూకాదు, భయం అంతకన్నాకాదు. నవ్వుతూనే తాను అతన్ని బాగా ఏడిపించి ఉండవలిసింది, అతనిమీద వినరదగిన విసుర్లన్నీ ఇప్పుడు తట్టాయి — కాని ఆ క్షణంలో బుర్రఏమీ పనిచెయ్యలేదు. పనిచెయ్యకపోతే మానె, తాను భయపడి పారిపోవటం మరీ అన్యాయం. మనిషి నిజంగా అందంగా ఉన్నాడు. ఉత్తరంలో అన్ని రాసి, ఆ మాట రాశాడుకాడు. రాస్తే తన ఉద్దేశం మారుతుందని కాదు....అతనికి డబ్బున్నమాట అబద్ధమైఉంటుంది. ఉంటే తనే ఒక పిక్చరుతీసి, హీరోవేసేపనికద!....

రోజులూ, వారాలూ గడుస్తున్నాయి,

(మిగత 30 వ పుటలో)




( 27వ పుట తరువాయి )

వాణికి కొత్త ఆశలూ, కొత్త బాధలూ. సమస్యలూ పట్టుకున్నాయి. తానిసారి వేసే రెండు వేషాలలోనూ ఒకటి "దురాశ" లోని వేషంలాటిదే. కాకపోతే, హీరోయిన్. రెండో వేషమే ఎముకలు కొరికేస్తోంది. తనచేత ఏవేవో దుస్తులు వేయిస్తున్నారు. అవి ధరించి తనకు నడవటం వేరే నేర్చుకోవలిసొచ్చింది. కారు డ్రైవింగు నేరవాలిట! ఈదటం నేరవాలిట. హీరో ఇవేవీచెయ్యడు. ఆడారి హీరో, మగరాయుడు హీరోయిన్నూ! సెట్టుమీద కూడా టేకులమీద టేకులు తీసి ప్రాణం తీసేస్తున్నారు.

"అచార్లగారూ, నేని పాత్రకు పనికి రానేమోనండీ?" అని అంటే, "అదేవిటమ్మాయ్! నటి అన్నాక అన్ని రకాల పాత్రలూ నటించాలి. నీ కెందుకు ధైర్యంగా చెయ్యి. ఏం చెయ్యాలో చెప్పటానికి డైరెక్టరుగా రున్నారుగా. చెయ్యటమే నీ వంతు," అన్నాడాయన.

బాగానే ఉంది, కాని అ చెయ్యటం దగ్గిరే పేచీ వస్తున్నది.

"ఏమోనండీ, ఈ ఒక్క వేషమూ పది వేషాల పెట్టుగా ఉన్నది. వాళ్ళిచ్చే పదివేలూ కూలికి చాలవు," అన్నది వాణి.

ఒక రోజు ఔట్‌డోర్ వెళ్ళి ఇంటికి తిరిగొచ్చేసరికి రాత్రి పది దాటింది. ఎక్కడో తడలో లాకేషను.

వాణి కారు దిగి — ప్రొడ్యూసర్ల కారు — ఇంట్లోకి అడుగు పెట్టేసరికి, బుల్లెమ్మ ఎవరితోనో టెలిఫోనులో మాట్లాడుతూండటం వినపడింది.

"అక్క వచ్చినట్టుంది. రేపు మాట్లాడుకుందాం," అన్న బుల్లెమ్మ మాటలూ, టెలిఫోన్ పెట్టేసిన చప్పుడూ వినిపించింది. మరు క్షణం బుల్లెమ్మ వాణి కెదురొచ్చింది.

"ఎవరే—"

వాణి మాట పూర్తి కాకముందే, "అక్కా, అచార్లుగారు రేపు నెల్లూరెళుతున్నారట. అవతెల్లుండి తిరిగొస్తానని చెప్పమన్నారు," అన్నది బుల్లెమ్మ.

"సరేలే," అన్నది వాణి అలసటతో.

తరవాత రెండు మూడు రోజులకు వాణి షూటింగుకు వెళ్ళి స్టూడియోలో కారు దిగుతుండగా దుర్గారావు చాలా సమీపంలోనే కనిపించాడు. మేకప్‌లో ఉన్న తెలుగు నటులిద్దరు అతనితో ఏదో మాట్లాడుతున్నారు. దుర్గారావు వాణిని చూశాడు గాని, ఎరగనట్టు మొహం పెట్టాడు.

వాణికి ఎందుకో పట్టరాని ఆగ్రహం వచ్చింది. అర్థం లేదు. అతను జిడ్డు పట్టించినా తనకు కోపం వచ్చింది, జిడ్డు పట్టించక పోయినా కోపం వచ్చింది. ఈ అసందర్భం ఎందుకు కలిగిందో తెలుసుకోవాలనిపించింది వాణికి.

"అతని ప్రేమంతా నటన! అందుకే నాకు కోపం వచ్చి ఉంటుంది," అనుకున్నది. కాని నటిగా తాను లక్షలు సంపాదించి, కీర్తి కూడా గడించాలనుకుంటున్నది. అతను నటుడైతే తన కెందు కభ్యంతరం?

"ఏమో, నాకు తెలీదు ఫో!" అని వాణి తనను తాను కసురుకున్నది.

తరవాత ఒక గంటకు దుర్గారావు వాణి నటించే సెట్టుమీది కొచ్చి, కెమేరా ముందుకు పోబోతుండగా అమెను సమీపించి, "మనం ఒక ముఖ్య విషయం మాట్లాడాలి. మీ చెల్లెలి పెళ్లి విషయం. ఆ అమ్మాయి నన్ను పెళ్లాడటానికి సిద్ధంగా ఉన్నది. నీ పర్మిషను తీసుకోమన్నది. ఫలానా అప్పుడంటే నేను వచ్చి ఈ విషయం మాట్లాడతాను," అన్నాడు.

వాణి శరీరంలోని నరాలన్నీ ఒక్కసారి నీలుక్కు పోయినట్టయాయి. అమె అతని కేమీ సమాధానం చెప్పకుండానే కామెరా ముందుకు వెళ్ళింది. అమె తిరిగి దుర్గారావు కోసం చూస్తే అతను సెట్టుమీద లేడు.

వాణి ఆ షాటు పూర్తిగా తగలేసింది. ఎనిమిది టేక్‌లయాక అమె, "నాకు ఒంట్లో బాగా లేదు," అని ఇంటికి వెళ్ళిపోయి, తన గదిలో తలుపేసుకుని సాయంకాలందాకా పడుకున్నది.

"ఇవాళ నీకు షూటింగు లేదన్నారు. కారు తీసుకొచ్చాను. అభ్యంతరం లేకపోతే ఏ అడయారు బీచికో వెళ్ళి, మీ చెల్లెలు పెళ్లి సంగతి మాట్లాడుకుందాం," అన్నాడు దుర్గారావు.

వాణి దడుచుకున్నది. మొత్తంమీద దుర్గారావును చూస్తే తనకు భయమేనని అమెకు స్పష్టమయింది. అందుకు అభిమానం కూడా పుట్టుకొచ్చింది. అమె లేచి, "పద!" అన్నది, తెచ్చుకున్న సాహసంతో.

కారు చాలా ఖరీదైనదని వాణి గ్రహించింది. దుర్గారావు డ్రైవు చేస్తుంటే వాణి వెనక సీటులోకి ఎక్కింది.

"మీ కిద్దరికీ పెళ్లి మాట లెప్పుడు జరిగాయి?" అన్నదామె ఉన్నట్టుండి.

"దాదాపు రెండు వారాలుగా," అన్నాడతను.

"ఎంతేసి సంబంధాలో తిప్పికొట్టావుగామాలు, మా చెల్లెలు ఎట్లా పనికొచ్చిందీ?" అన్నది. వాణికి కొస్త కాస్తే ధైర్యం వస్తున్నది.

"నీ చెల్లెలు గనకా!"

"అదంటే ప్రేమేనా?"

"లేదు. ప్రేమ నువంటేనే!"

"అయితే దాన్నెందుకు చేసుకోవటం?"

"నిన్ను చేసుకోలేను గనకా."

"నామీద కసికొద్దీ దాని గొంతు కొస్తావా?"

"గొంతు కొయ్యను. పెళ్లాడతాను."

"ప్రేమ లేకుండా పెళ్లాడటమంటే గొంతు కొయ్యటం కాదూ?"

"కాదు. నువు రేపు ఎవరినో ప్రేమించే పెళ్లాడతావా? ఎవరి గొంతూ కొయ్యవా? రేపు మీ చెల్లెల్ని ప్రేమించిన వాడికే ఇచ్చి చేస్తావా? ప్రేమంటే ఏమిటో నువు తెలుసుకుంటావా? లేక ఒక చిన్న డ్యూయెట్ పాడిస్తావా?"

వాణి మాట్లాడలేదు.

"పోనీ, నాకోసంగతి చెప్పు. నేను నిన్ను ప్రేమించాను. అంటే మరొకతెను ప్రేమించలేను. నువేమో నన్ను పెళ్లాడవు. నేను పెళ్లి కాకుండా ఉండాలా? ప్రేమించకుండానే ఎవతెనన్నా పెళ్లాడాలా? ప్రేమించినా ప్రేమించక పోయినా, పెళ్లి తప్పదనుకుని, నేను ప్రేమించిన మనిషికి చాలా దగ్గిర దాన్ని—అంటే నీ చెల్లెల్ని—పెళ్లాడ నిశ్చయించాను. అది తప్పా?"

వాణి మాట్లాడలేదు. అతను కూడా మాట్లాడకుండా కారును నడుపుకుంటూ అడయారు బీచికేసి పోనిచ్చాడు.

కారు నిర్జన ప్రదేశంలో ఆగింది.

"నాకే సమాధానమూ చెప్పలేదు," అని దుర్గారావు వాణిని హెచ్చరించాడు.

"నాకి పరీక్షలన్నీ పెట్టి ఎందుకు వేధిస్తున్నట్టు?" అని వాణి అడిగింది నీరసంగా.

"ఎన్నిసార్లు చెప్పను? నేను నిన్ను ప్రేమించాను. ఆ మాట నీ మెదడులోకి ఇంకినట్టులేదు."

"ఏమైనా నేను మీ ఇద్దరి పెళ్లికి ఒప్పుకోను. ఇది చాలా దారుణం! ఘోరం!" అన్నది వాణి.

"ఎందుకుదారుణం? మీ చెల్లెలు ఆస్తిపరుడి భార్య అవుతుంది. ఆమె పిల్లలు దారిద్ర్యం ఎరగకుండా పెరుగుతారు."

"నీకదంటే ఇష్టంలేదు."

"అది పొరపాటు, వాణీ. నువొక చిన్న పిల్లిని పెంచుకుంటే నాకు దానిమీద కూడా ఇష్టంఉంటుంది. నా మాట నమ్ము. నన్ను అవమానించుగాని, నా ప్రేమను అవమానించకు."

"ప్రేమ! ప్రేమ! ప్రేమ! నాకా ప్రేమంటే ఏమీ నమ్మకంలేదు," అన్నది వాణి వెర్రెత్తి.

"ఇంకేం? నీ చెల్లెల్ని నేను చేసుకుంటాను. ఒప్పుకో! నేను నీ చెల్లెల్ని ప్రేమించటం లేదన్నది సాకుగా చెప్పకు."

వాణికి మతిపోతున్నది. ఆమె తలను చేతుల్లో పట్టుకుని కూర్చున్నది. దుర్గారావు తన సీటులోనుంచి దిగి వెనక సీటులోకి వచ్చి, వాణి వీపుమీద చెయ్యివేసి," నీ మనసు బాగాలేదు. కొన్నాళ్లు టైముతీసుకో. తొందరలేదు. నేనింకా చాలాకాలం పట్నంలోనే ఉంటాను," అన్నాడు.

వాణి ఎడంగా జరిగింది. దుర్గారావు తిరిగి ముందు సీటులోకి వెళ్లి కారును వెనక్కుతిప్పి పోనిచ్చాడు.

తాను వేస్తున్న రెండు వేషాలలోనూ ఒకటి తనకు పేరుతెచ్చేదనీ, రెండోది తనను అపఖ్యాతిపాలు చేసేదనీ వాణికి స్పష్టంగా తెలిసి పోయింది.

రెండో పిక్చరు పూర్తికావస్తున్నది—సినీ జర్నలిస్టు లన్నట్టు "శరవేగం" తో. మొదటిదిమటుకు ఏదో అవాంతరాలొచ్చి "తాత్కాలికంగా" షూటింగు నిలిచిపోయింది.

ఇదేసమయంలో బుల్లెమ్మ తన పెళ్లి విషయం ఎత్తింది.

"నీకు నిజంగానే ఆ దుర్గారావును చేసుకోవాలనుందిటే?" అన్నది వాణి.

"అవునక్కా."

"అతనింకెవరినో ప్రేమిస్తున్నాడనుకుంటాను?"

"ఎవరినో కాదక్కా, నిన్నే!"

వాణి నిర్ఘాంతపోయింది. "నన్ను ప్రేమించేవాణ్ణి నువు చేసుకుంటావా?" అని అడిగింది.

"నిన్ను ప్రేమించకుండా నన్నెవరైనా ప్రేమిస్తారా, అక్కా? దుర్గారావుగారన్నట్టు ఎవరి ప్రేమ వాళ్లది. నాకాయనంటే చాలా ఇష్టం."

"అయితే నీ యిష్టంవచ్చినట్టు ఏడుచుకో," అన్నది వాణి చిరాకుగా.

బుల్లెమ్మ ఉత్సాహంగా, "నువొప్పుకున్నావని ఆయనతో చెప్పనా?" అన్నది.

"నువ్వేమీ చెప్పక్కర్లేదు. చెప్పేదేదో నేనే చెబుతాను"....

అనుకున్నంతా అయింది. రెండో పిక్చరు రిలీజయింది. వాణి నెల్లూరు థియేటరుకు వెళ్లి మొదటి ఆట చూసింది. ప్రేక్షకులామెను చూసి నవ్వారు, అవాచ్యాలు మాట్లాడారు. చీకట్లో వాణి ఏడిచింది. ఇంటర్వెల్ రాకమునుపే థియేటరులోంచి బయటికి వచ్చేసింది.

రెండురోజుల అనంతరం వాణి ఇంటికి దుర్గారావు వచ్చాడు. రిలీజైన పిక్చరు గురించి అతనేమీ అనలేదు. డబ్బు లేక ఆగిపోయిన పిక్చరుకు తాను డబ్బుపెడతానన్నాడు. బుల్లెమ్మను తాను పెళ్లాడటానికి ఒప్పుకోమన్నాడు.

"కావలిస్తే మీరు మా చెల్లెల్ని పెళ్లాడండి, కాని నాకోసం డబ్బు పోగొట్టుకోవద్దు," అన్నది వాణి నీరసంగా.

"ఏం? నామీద కాస్త అపేక్షా, గౌరవమూ పుట్టుకొచ్చినట్టుందే?" అన్నాడతను.

వాణి విషాదంగా ఒక చిన్న నవ్వు నవ్వింది....

దుర్గారావు సహాయంతో పిక్చరు పూర్తి అయింది. అందులో వాణి నటనను సినీ జర్నలిస్టులు మెచ్చుకుని, అటువంటి వేషాలే వెయ్యమని సలహా ఇచ్చారు.

పిక్చరు రిలీజవుతూనే హిట్టవుతుందని తేలిపోయింది. ఆ నెల్లూరులోనే అదే థియేటరులో మళ్లీ తన పిక్చరు చూసుకుని, ఆడియన్స్ రియాక్షనుచూసి వాణి ఆనందాశ్రువులు రాల్చింది.

నెల్లూరునుంచి దుర్గారావు కార్లో తిరిగి వచ్చేటప్పుడు బుల్లెమ్మ తనకు నిద్రవస్తున్నదని వెనకసీటు ఆక్రమించేసింది. వాణి దుర్గారావు పక్కన ముందు సీటులో కూర్చున్నది,

"ఎలాఉంది?" అన్నాడతను అకస్మాత్తుగా.

"ఏమిటి?" అన్నది వాణి ఆశ్చర్యంగా.

"తడుముకోకుండా ఏదో ఒకటి చెప్పెయ్యాలిగాని, ప్రశ్నకు ప్రశ్న వెయ్యగూడదు."

"మీ ఋణం తీర్చుకోలేను."

"అయితే నన్ను పెళ్లాడెయ్యి."

"బుల్లెమ్మ గొంతుకోస్తారా?"

"ఓహో, నేనేంచేసినా బుల్లెమ్మ గొంతుకు డేంజరేనన్నమాట. నీకా భయం ఏమీ అవసరంలేదు. బుల్లెమ్మ సపోర్టుతో ఈ నాటకం ఆడాను."

వాణికి శివం ఎత్తినట్టయింది. ఆమె అతని మెడమీదుగా చెయ్యివేసి గట్టిగా వాటేసుకున్నది.

దుర్గారావు కారుకు సడెన్ బ్రేక్‌వేశాడు.

ఒక అరనిమిషం అయాక, వెనక సీటులోంచి బుల్లెమ్మగొంతు శాపీగా వినిపించింది:

"ఏమర్రా, కారూ, డయలాగూ రెండూ ఆగిపొయ్యాయేం?"

